# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రైతుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.

❖ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

❖ ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ అధికారులను ఆదేశించారు.

❖ మురికివాడల నిర్వాసితుల కోసం ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని మంత్రి పి. నారాయణ తెలిపారు.

======================

రైతుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు ఉపముఖ్యమంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి 20 కోట్ల 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులను గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముక్కోటి ఏకాదశి రోజున శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యకు 35 రోజుల్లోనే పరిష్కారం చూపామన్నారు. డ్రెయిన్ ఆధునికీకరణ చేయడంతో పాటు డ్రెయిన్ ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణతో వందలాది మంది కొబ్బరి రైతులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామని ఉపముఖ్యమంత్రి వివరించారు.

======================

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మంత్రి ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య భద్రత నూతన సంవత్సరంలో సంకల్పం కావాలని ఆయన ఆకాంక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రత, నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని కోరారు. వేగంగా విస్తరిస్తున్న మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను అరికట్టడానికి ప్రజల జీవన విధానంలో సమగ్ర మార్పు ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ప్రక్రియల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వైద్యులు, ఇతర సిబ్బంది రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, వ్యాధుల బారినపడిన రోగుల చిరునవ్వే లక్ష్యంగా సేవలను అందించాలన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన ఆశయాలకనుగుణంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

======================

మురికివాడలలో నివసిస్తున్న పేదలకు సొంత ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని వైకుంఠపురం ప్రాంతంలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలు వచ్చిన సమయంలో వైకుంఠపురంతో పాటు పలు మురికివాడలు ముంపునకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇళ్ళను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. ఇటీవల విశాఖపట్నంలోని లక్ష్మీపురం అనే మురికివాడను సందర్శించినట్లు తెలిపారు. అక్కడ నివసిస్తున్న 177 మంది పేదలకు అపార్ట్మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

======================

ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు అన్నారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లాలో ఈ ఏడాది జరిగిన నేరాల గురించి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం నేరాలు 6.61 శాతం తగ్గాయన్నారు. ఆస్తి, మహిళల సంబంధిత కేసులు, రోడ్డు ప్రమాదాల విషయంలో కూడా తగ్గుదల నమోదైందన్నారు. నార్కోటిక్స్ కు సంబంధించిన కేసులు స్వల్పంగా పెరిగాయని తెలిపారు. గతేడాది సంఘటనలను విశ్లేషించి ప్రజలకు మెరుగైన భద్రత కల్పిస్తామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

======================

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చీరాల ప్రభుత్వ వైద్యశాలలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తో కలసి ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఓ.పి. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ యాప్ పని తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు.

======================

భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. ఈ సంవత్సరం అనేక రంగాలు విధి విధానాలతో ప్రభావవంతంగా మారాయి. సాంస్కృతిక రంగంలో భారతదేశం 2025 సంవత్సరం సాధించిన పురోగతిపై ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం...

అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ఈ సంవత్సరం దేశ ఆధ్యాత్మిక రంగంలో ఒక నిర్ణయాత్మక ఘట్టంగా నిలిచింది. నవంబర్‌లో ఒక చారిత్రాత్మక ఘట్టంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలయం పైభాగంలో కాషాయ ధర్మ ధ్వజాన్ని ఎగురవేశారు. దీపాల పండుగ దీపావళిని యునెస్కో మానవాళి అవ్యక్త సాంస్కృతిక వారసత్వ జాబితా (UNESCO Intangible Cultural Heritage List)లో చేర్చడంతో ఈ సంవత్సరం గుర్తుండిపోతుంది. అదే విధంగా.. భారతదేశంలోని మరాఠా సైనిక ప్రకృతి దృశ్యాలు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చబడ్డాయి. ఇది ప్రపంచ వారసత్వ శక్తిగా దేశ స్థానాన్ని గణనీయంగా పెంచింది. సమిష్టి భాగస్వామ్యంతో జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఏడాది పొడవునా స్మరించుకునేలా స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని అందరిలో నిలిపింది. కోటీ 60 లక్షలకు పైగా పౌరులు తమ పాటలను రికార్డ్ చేయడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమం చారిత్రాత్మక చిహ్నాన్ని దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మార్చారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ్‌లో 66 కోట్లకు పైగా యాత్రికులు పాల్గొన్నారు. ఇది ప్రపంచ మత సమాజాలను అధిగమించింది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణేలు, స్టాంపులను విడుదల చేయడంతో సహా రాష్ట్రీయ ఏక్తా దివస్‌పై అనేక కార్యక్రమాలు జరిగాయి. అలాగే.. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు నిర్వహించారు.

======================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశ ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు.

======================

రేషన్ షాపుల ద్వారా సరుకులను ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. హోళగుంద మండల కేంద్రంలో ప్రభుత్వ చౌక ధరల దుకాణాన్ని కలెక్టర్ ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ, స్టాక్ వివరాలు, ఈ–పాస్ యంత్రాల వినియోగం, కార్డుదారుల హాజరు నమోదు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి కార్డుదారుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

======================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రవేశపెడుతున్న పథకాలను వివరించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెరుగైన, నాణ్యమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం నూతన సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం తదితర వాటి కోసం సన్న, చిన్న కారు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ)లో భాగస్వామ్యం కావడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

======================
======================